క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం దివ్యక్షేత్రంలో జరిగిన వ్రతాల్లో పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

చిల్డ్రన్ ఫెస్టివల్‌కు అనూహ్య స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: చిల్డ్రన్ ఫెస్టివల్‌కు బాలల నుంచి మంచి స్పందన లభిస్తుందని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు అన్నారు. ఆదివారం ఉక్కునగరంలో జరిగిన సమావేశంలో డిసెంబర్ 1,2 తేదీల్లో నిర్వహించనున్న చిల్డ్రన్ ఫెస్టివల్ ఏర్పాట్ల గురించి సమీక్షించారు. ఇప్పటికే ఈవెంట్లలో 14 వందల విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. విద్యా సంస్థలు ఫెస్టివల్ కార్యదర్శి కె. సుశీలను 83098 12422 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఎం.ఎస్.ఎస్. మూర్తి, కార్యదర్శి కె. సుశీల, బి. పద్మావతి, ప్రదీప్, దుర్గాప్రసాద్, పార్థసారథి, మహేష్, సూర్యనారాయణ, మధు, కేశవానంద్, రామశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సుమన్ తల్వార్‌కు సత్కారం



సుమన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గాజువాక: ప్రముఖ సినీ నటుడు సుమన్ తల్వార్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆదివారం సత్కరించారు. నగరంలోని పోర్టు స్టేడియంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కరాటే పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరైన సుమన్‌ను శాలువాతో సత్కరించి మార్షల్ ఆర్ట్స్‌లో ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వాడోయాక్ కరాటే డో అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్, కోచ్ అంగ రాము, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మురళీమోహన్‌రావుకు ఐఎంఏ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ మురళీమోహన్‌రావు

మహారాణిపేట: కోవిడ్ సమయంలో అందించిన సేవలకు గుర్తింపుగా విశాఖకు చెందిన డాక్టర్ ఎం.వి.వి.మురళీమోహన్‌రావుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అవార్డు ప్రదానం చేసింది. ఆదివారం మంగళగిరిలో జరిగిన ఐఎంఏ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీహరిరావుల నుంచి ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా డాక్టర్ మురళీమోహన్‌రావు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ఐఎంఏ నాయకులు జె.సి.నాయుడు, డాక్టర్ సమరం, డాక్టర్ సి.ఎస్.రాజు, వి.అశోకన్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తశోభతో.. రుద్రభూములు



ఇది కదా అభివృద్ధి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనా పగ్గాలు చేతపట్టిన నాటి నుంచి సంక్షేమ పాలనతో అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందజేస్తున్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. పేదలకు మౌలిక వసతులు కల్పిస్తూ వారి జీవన ప్రమాణం మెరుగుపడేందుకు కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వాలు విఫలమైన పలు అంశాలు చేపట్టి భేషుకైన రీతిలో సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

నాడు — సరైన సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. వర్షాకాలంలో రుద్రభూమిలో అంతిమ సంస్కారాలు చేయడానికి వీలు కాక నానా తిప్పలు పడేవారు. రాళ్లు, తుప్పలతో శ్మశాన వాటికలు భయంకరంగా ఉండేవి. కనీస సదుపాయాలు ఉండేవి కాదు. కాలిబాటలు సవ్యంగా లేక అవస్థలు పడేవారు.

నేడు — అనేక సదుపాయాలు కల్పించారు. శ్మశాన వాటికల్లో కాంపౌండ్ వాల్, బర్నింగ్ ప్లాట్‌ఫారం, వెయిటింగ్ హాల్, సీసీ పాత్‌వే వంటివి నిర్మించడం వల్ల సులభంగా రాకపోకలు సాగుతున్నాయి. దహన సంస్కారాలు కూడా అనుకున్నట్లు చేయగలుగుతున్నారు. పచ్చదనం పెంపొందించారు. కావలసిన రీతిలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పూర్తిగా ఆధునికీకరించారు.

అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక..	గుడివాడ అప్పన్న కాలనీ శ్మశాన వాటిక..	అగనంపూడి శ్మశాన వాటిక	తలారివానిపాలెం శ్మశాన వాటిక
రూ.1.15 కోట్లతో అభివృద్ధి	రూ.30 లక్షలతో అభివృద్ధి	రూ.70 లక్షల వ్యయంతో అభివృద్ధి	రూ.39 లక్షలతో అభివృద్ధి
కాంపౌండ్ వాల్, బర్నింగ్ ప్లాట్‌ఫారం, వెయిటింగ్ హాల్, సీసీ పాత్‌వే, గ్రౌండ్ ఫిల్లింగ్, పెయింటింగ్‌లతో కొత్త రూపు	బర్నింగ్ ఫ్లాట్‌ఫారం, వెయిటింగ్ హాలు నిర్మించి, పచ్చదనం పెంపొందించారు	ప్రహరీ, అంతర్ రహదారి నిర్మాణం	రక్షణ గోడ, షెడ్ల నిర్మాణం

- ప్రభుత్వ చొరవతో కొత్తరూపు సంతరించుకున్న శ్మశాన వాటికలు
- మౌలిక వసతులు కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- గతంలో రుద్రభూములు ఇలా లేవంటూ స్థానికుల కితాబు

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారు. పేదలకు మెరుగైన జీవితం అందించేందుకు అనేక సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా శ్మశాన వాటికల్లో సదుపాయాలు కల్పించారు. పచ్చదనం అభివృద్ధి చేసి శ్మశాన వాటికలను పార్కులను తలదన్నేలా అందంగా తీర్చిదిద్దారు.

శ్మశాన వాటికలకు కొత్తరూపు..

ఆఖరి మజిలీల (శ్మశాన వాటికలు) అభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పించారు. వార్డులో అన్ని శ్మశాన వాటికలు కొత్త రూపు సంతరించుకోవంతో కర్మకాండలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించుకునే అవకాశాన్ని కల్పించారు. గత ప్రభుత్వాల హయాంలో



అగనంపూడి కైలాస భూమి

శ్మశాన వాటికలు దుర్భర పరిస్థితుల్లో ఉండేవి. వర్షాకాలంలో కర్మకాండలు జరిపించుకోవాలంటే నరక ప్రాయం అనిపించేది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటికను రూ.1.15 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. కాంపౌండ్ వాల్, బర్నింగ్ ప్లాట్‌ఫారం, వెయిటింగ్ హాల్, సీసీ పాత్‌వే,



సుందరగా తయారు చేసిన తలారివానిపాలెం శ్మశానం

గ్రౌండ్ ఫిల్లింగ్, పెయింటింగ్‌లకు నిధులు కేటాయించారు. ఇదే వార్డు పరిధి గుడివాడ అప్పన్నకాలనీలో రూ.30 లక్షల వ్యయంతో బర్నింగ్ ప్లాట్‌ఫారం, వెయిటింగ్ హాలు తదితర సౌకర్యాలు కల్పించి శ్మశాన వాటికను ఆధునికీకరించారు.

శ్మశానాలకు రాచబాట..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని శ్మశాన వాటికకు రూ.70 లక్షల వ్యయంతో వసతులు కల్పించారు. ప్రహరీ నిర్మించి ఆవరణాన్ని చదును చేశారు. అంతర్ రహదారి నిర్మించి వర్షాకాలంలో మృతదేహాల దహన సంస్కారాలకు షెల్టర్ నిర్మించారు. నీటి వసతి ఏర్పాటు చేశారు.

సుందరంగా తలారివానిపాలెం కైలాసభూమి..

85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ తలారివానిపాలెం కై లాస భూమిని సుందరంగా తీర్చిదిద్దారు. రూ.39 లక్షలతో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో రక్షణ లేకుండా ఉన్న ఆవరణాన్ని శుభ్రం చేశారు. రక్షణ గోడ, రెండు షెడ్లు నిర్మించారు. ఆవరణలో ఇంటర్నల్ రోడ్లు వేశారు. మంచినీటి వసతి కల్పించారు. పందులు, పశువులు లోపలికి ప్రవేశించకుండా రక్షణ గోడతో పాటు గేటు ఏర్పాటు చేశారు.



గుడివాడ అప్పన్నకాలనీలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన శ్మశానవాటిక



గుడివాడ అప్పన్నకాలనీ శ్మశాన వాటిక ముఖద్వారం

రుద్రభూమిని అభివృద్ధి చేశారు..



ఆఖరి మజిలీ సజావుగా సాగేందుకు అన్ని సౌకర్యాలు ఉండాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అదే చేసింది. ఆ పార్టీ చేసిన మంచి పనుల్లో అతి ప్రధానమైనది ఇదే. పార్కులతో సమానంగా రుద్రభూమిని సుందరంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–శివ, అక్కిరెడ్డిపాలెం

శ్మశానాలకు మహర్దశ..



ఒకప్పుడు శ్మశానాలంటే హడలిపోయేవాళ్లం. లోపలికి వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వచ్చేది. శ్మశానాలు ఇంతలా మారుతాయని అసలు అనుకోలేదు. ప్రభుత్వం మంచి ఆలోచన చేసింది. వీటిని సంస్కరించాలనే ఆలోచన రావడం సంతోషం.

– ఐ.అప్పలరాజు, నిర్వాసితకాలనీ

ఎంతో మార్పు..



ప్రజాహితాన్ని గుర్తించి శ్మశానాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం అభివృద్ధికి ముందడుగు అని చెప్పాలి. అపరిశుభ్ర వాతావరణంతో పాటు దట్టంగా ముళ్లపొదలు ఉండడంతో అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. నేడు వాటికి ఫుల్‌స్టాప్ పెట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– డి.శ్రీను, అగనంపూడి



అగనంపూడి రుద్రభూమిలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ రోడ్డు

విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1018వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులతో పాటు వైస్సార్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ముందుగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉక్కునగరం: స్టీల్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ప్రస్తుత పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో స్టీల్‌ప్లాంట్ డీజీఎం జె.వి. రావు రిటర్నింగ్ అధికారిగా నూతన కార్యవర్గం కోసం ఎన్నికలు నిర్వహించారు. క్లబ్ కార్యదర్శిగా ఎస్.వి. సత్యనారాయణ తన సమీప ప్రత్యర్థి పెంటకోట రామకృష్ణపై 3 ఓట్ల తేడాతో గెలుపొందారు. సంయుక్త కార్యదర్శిగా జి. సురేష్ గెలుపొందారు. కోశాధికారిగా ఆర్. సత్యనారాయణ 338 ఓట్లు సాధించి గెలుపొందారు. గ్రూప్–1 నుంచి కార్యవర్గ సభ్యులుగా బి.వి. రమణ, వై. రవికుమార్, గ్రూప్–2 నుంచి కార్యవర్గ సభ్యులుగా కె.ఎల్. నర్సింహం, ఎం. కృష్ణయ్య, పి.



ఎన్నికల అధికారి, ప్రస్తుత కార్యవర్గంతో నూతన కార్యవర్గ సభ్యులు

పరమేశ్వరరెడ్డి, ఎ. శ్రీనివాసవర్మ, వి. అప్పలరాజు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి జె.వి. రావు గెలిచిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు.

మోదీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

గాజువాక: అదానీ, అంబానీల కోసమే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ అన్నారు. స్థానిక చైతన్యనగర్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి సీపీఐ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పద



సమావేశంలో మాట్లాడుతున్న స్టాలిన్

న్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పారి విష్ణుమూర్తి, దొడ్డి మల్లేశ్వరరావు, పొనగంటి భాస్కరరావు, అప్పారి శ్రీలక్ష్మి, పిల్లా సూర్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయవాది ‘పురిపండా’

మహారాణిపేట : జాతీయవాదిగా, అభ్యుదయ రచయితగా పురిపండా అప్పల స్వామి సామాజిక ప్రగతికి చేసిన కృషి అనిర్వచనీయమని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బండి సత్యనారాయణ అన్నారు. ఆదివారం టర్నర్ సత్రంలో 22వ విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో భాగంగా అరసం జిల్లా సమితి నిర్వహిస్తున్న సాహిత్య సదస్సులో భాగంగా ఆదివారం పురిపండా సాహిత్య జీవితం, శ్రీశ్రీ సాహి



ప్రసంగిస్తున్న డాక్టర్ బండి సత్యనారాయణ

త్యంలో విప్లవం అనే అంశాలపై సదస్సులు జరిగాయి. అరసం కార్యదర్శి డాక్టర్ సి.ఎస్. క్షేత్రపాల్, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ. రాజు, సాహితీవేత్తలు మధుసూదన్‌రావు, హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరా బంద్

అక్కిరెడ్డిపాలెం : బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద మంచి నీటి పైపునకు సాంకేతిక సమస్య తలెత్తడంతో మంచి నీటి సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం ఈఈ కనకారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ 66,67 వార్డుల పరిధిలో అన్ని ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రపంచ దేశాలు గొప్పగా చెప్పుకునే రాజ్యాంగం మనది



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు



నెల్లిముక్కులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



స్టీల్‌ప్లాంట్‌లో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

గాజువాక: ప్రపంచ దేశాలు సైతం గర్వంగా చెప్పుకునే రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భారతదేశానికి అందించారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బీసీ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితవర్గాలకే కాకుండా అన్ని వర్గాలకు ఉపయోగపడే విధంగా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. రాజ్యాంగం స్ఫూర్తిగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను అందిస్తున్నారన్నారు. రిజర్వేషన్లు అమలు చేయడానికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, భూపతిరాజు సుజాత, నాయకులు గంట్యాడ గురుమూర్తి, గొందేశి వెంకట రమణారెడ్డి, నక్క వెంకట రమణ, సంపంగి ఈశ్వరరావు, పల్లా పెంటారావు, గుడివాడ లతీష్, సిరట్ల శ్రీనివాస్, కటికల కల్పన, దేవుపల్లి సంపూర్ణం, ములకలపల్లి వెంకటేష్, అండిబోయిన అప్పారావు, రెడ్డి జగన్నాథం, కాకినాడ పెంటారావు, పాము రామశాస్త్రి, మెడికల్ బాబు, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, గొందేశి ప్రభాకరరెడ్డి, రామలక్ష్మి, వాడపల్లి రామచంద్రరావు, టేకేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హక్కులు, బాధ్యతలే పునాది..

అగనంపూడి: ప్రజాస్వామ్యానికి హక్కులు, బాధ్యతలు పునాదుల వంటివని అగనంపూడి ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ ప్రమీల అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అగనంపూడి కొండయ్యవలస అంబేడ్కర్ యువ జన సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజ్యాంగంలో ఉన్న అంశాలను గౌరవించి వాటి ప్రకారం అన్ని వ్యవస్థలు నడుచుకుంటే భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఉక్కు డీజీఎం చంద్రశేఖర్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు పి.శివప్రసాద్, స్థానిక నాయకులు బలిరెడ్డి శ్రీను, సత్యనారాయణ, కొలిపాక అప్పారావు, కిడిమి హనుమంతరావు, గుదే సుశీలా గజేంద్రరావు, కసిపల్లి శ్రీనివాసరావు, దొడ్డి దేముడు, వంకర రాము, అంబేడ్కర్ యువ జన సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్‌కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, జేఎస్ మూర్తి, ఎం. సూర్యనారాయణ, సుందరమూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో..

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం ప్రధాన కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా రాజ్యాంగ నిర్మాణం

కుల, మత, లింగ, ప్రాంతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని నిర్మించారని మాటూరి శ్రీనివాసరావు అన్నా రు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడ బ్రిడ్జి దిగువన ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో 86వ వార్డు వైఎస్సార్‌సీపీ నా యకులు మెడికల్‌బాబు, రామచంద్రరాజు, గాలి ఆనంద్, బలిరెడ్డి పెంటయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ప్రమీల

నెల్లిముక్కులో..

పెదగంట్యాడ: రాజ్యాంగ దినోత్సవాన్ని నెల్లిముక్కులో ములకలపల్లి పెంటయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీభాయ్, పులి వెంకటరమణారెడ్డి, డి. అప్పారావు, ఎం. రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

ఉక్కునగరం: భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఉక్కునగరంలో ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సెక్టార్–6 అంబేడ్కర్ పార్కులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ దేశ ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో ఉండగలుగుతున్నారంటే అది కేవలం అంబేడ్కర్ గొప్పతనం అన్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవ పరుగును అసోసియేషన్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ పార్కు వరకు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బి. తౌడన్న, మోహన్‌బాబు, డి. పుల్లారావు, ఫణీంద్రబాబు, జ్యోతి, ఓబీసీ సంఘం ప్రతినిధులు బి. అప్పారావు, శ్రీనివాస్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ



అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం

పెదగంట్యాడ: మండలంలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని దీపాలు వెలిగించారు. పర్వదినాల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యుడు కె. శివకుమార్ చెప్పారు. అలాగే బాలచెరువులోని శివాలయంలో కూడా పెద్ద ఎత్తున లక్ష కుంకుమార్చనలు చేశారు. అనంతరం జ్వాలాతోరణం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో షిర్డీసాయి శాంతి ధామంలో జ్వాలాతోరణం నిర్వహించారు.